సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 1 । మార్చి । 2024



100%కు దగ్గరలో..

ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ జోరుగా జరుగుతోంది. 90 శాతం పంపిణీ జరిగింది.

- 8లో



నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ఇంటర్ పరీక్షలు నేటి నుంచి మొదలు కానున్నాయి. ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- 8లో

ప్రతి సోమవారం చేనేత ధరిద్దాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ అన్నారు. చేనేత భారతదేశ సంప్రదాయ కళ, సంస్కృతిని ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం వన్ డిస్ట్రిక్ట్, వన్ ప్రొడక్ట్ కింద పొందూరు కాటన్ వస్త్రాలు ఎంపిక చేసిందని తెలిపారు. యువతను ఆకర్షించేందుకు అన్ని ఉత్పత్తులపై 30 శాతం తగ్గింపుతో విక్రయాలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అధికారులతో పాటు కింది స్థాయి సిబ్బంది కూడా ప్రతి సోమవారం ధరించాలని సూచించారు.

న్యూస్‌రీల్

ఏపీ ఎన్‌జీఓ సంఘు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చౌదరి



చౌదరి పురుషోత్తమ నాయుడు

శ్రీకాకుళం అర్బన్: ఏపీ ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చౌదరి పురుషోత్తమనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్‌జీఓ సంఘ అధ్యక్షునిగా ఉన్న బండి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణతో తాజాగా ఎన్నికలు జరిగాయి. సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా శివారెడ్డి ఎన్నిక కాగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చౌదరి పురుషోత్తమనాయుడు ఎన్నికయ్యారు. గతంలో సంఘ ఉపాధ్యక్షునిగా నాలుగు పర్యాయాలు, రాష్ట్ర సహాధ్యక్షునిగా కూడా నాలుగు సార్లు పనిచేశారు. ఇప్పుడు ఎన్‌జీఓ సంఘ ఎన్నికల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఎన్‌జీవో సంఘ అసోసియేషన్‌కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గతంలో శ్రీకాకుళం జిల్లా నుంచి గానీ, ఉత్తరాంధ్ర నుంచి గానీ ఏ ఒక్క ఉద్యోగి కూడా ఎన్నిక కాలేదు. ఆ అవకాశం పురుషోత్తమనాయుడుకు రావడం అభినందనీయమని పలువురు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఎన్‌జీవో సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తగా డాక్టర్ చిట్టిబాబు



డాక్టర్ చిట్టిబాబు

ఆమదాలవలస: ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తగా డాక్టర్ జి.చిట్టిబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఇంతవరకు ఇన్‌చార్జి ప్రధాన శాస్త్రవేత్తగా రాగోలు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పీవీ సత్యనారాయణ వ్యవహరించారు. ఆయన స్థానంలో చిట్టిబాబు బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ఆమదాలవలస ఏరువాక కేంద్రం, కృషివిజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తగా పనిచేసి జిల్లా రైతులకు విస్తరణ సేవలు అందించారు. అనంతరం జిల్లాల పునర్విభన నేపథ్యంలో భాగంగా పాడేరుకు వెళ్లారు. ఇప్పుడు మళ్లీ ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులకు విస్తృతంగా సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం రూ. 2.18 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం గడిచిన 60 రోజులకు గాను రూ.2,18,155 వచ్చినట్లు ఈఓ పి.ప్రభాకరరావు గురువారం తెలిపారు. శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో హుండీని లెక్కించడం సంప్రదాయం కాగా దేవదాయ శాఖ ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు లెక్కింపు జరిగినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ బీఎస్ రవి కుమార్, అర్చకులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి ప్యాసింజర్ రైలు



కంచిలి: విశాఖ నుంచి పలాస వరకు నడిచే ప్యాసింజర్ రైలు బరంపురం వరకు పొడిగించిన సంగతి తెలిసిందే. ఈ రైలు మార్చి 4వ తేదీ నుంచి బరంపురం నుంచి నడవడం ప్రారంభమవుతుందని సోంపేట స్టేషన్ మేనేజర్ శంకర్ బెహరా, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు కట్టా సూర్యప్రకాశరావు తెలిపారు. ఈ మేరకు ఖుర్దారోడ్ సీపీటీఎం నుంచి ఉత్తర్వులు గురువారం సాయంత్రం ఉత్తర్వులు విడుదలైనట్లు వెల్లడించారు. మార్చి 3వ తేదీ రాత్రికి 08532 నంబర్ రైలు విశాఖపట్నం నుంచి బరంపురానికి చేరుకొని, మార్చి 4వ తేదీ నుంచి బరంపురంలో 08531 రైలు బయలుదేరుతుంది. ప్రతి రోజు ఈ రైలు ఉదయం 3.50 గంటలకు బరంపురంలో బయలుదేరి, ఇచ్ఛాపురం 4.09 నిమిషాలకు చేరి, అక్కడి నుంచి 4.10 గంటలకు బయలుదేరి, సోంపేటకు 4.22కు చేరి, ఇక్కడ 4.23కు బయలుదేరి, మందసకు 4.33కు చేరి, అక్కడి నుంచి 4.34కు బయలుదేరుతుంది. ఈ రైలు విశాఖపట్నానికి ఎప్పటిలాగే ఉదయం 9.20 గంటలకు చేరుతుంది. తిరిగి విశాఖ నుంచి సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరి, మందసకు రాత్రి 10.15గంటలకు, సోంపేటకు 10.31 గంటలకు, ఇచ్ఛాపురానికి 10.47 గంటలకు, బరంపురానికి 11.10 గంటలకు చేరుతుంది. ఈ రైలు బరంపురం స్టేషన్‌లో 4వ నంబర్ ప్లాట్ ఫాం నుంచి బయలు దేరుతుందని తెలిపారు.











● అభిషేక వైభవం

మందస వాసుదేవుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం స్వామికి విశేష అభిషేకాలు జరిగాయి. స్వామి నిజరూప దర్శనంతో భక్తులు పులకించిపోయారు. ఉదయం శ్రీమన్నారాయణ భక్తి స్వర సంగమం(లొహరిబంద) కళాకారులతో అన్నమయ్య సంకీర్తనాగానం, సాయంత్రం చలపరాయ్ చాణిక్యబృందం(కపాసుకుద్ది) కళాకారులతో జరిగిన సంగీత విభావరి ఆకట్టుకున్నాయి. –మందస

జగనన్న సైనికుల్లా పనిచేద్దాం



జిల్లా సోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

- సీఎం వైఎస్ జగన్‌లో నాయకత్వ లక్షణాలు పుష్కలం: మంత్రి ధర్మాన ప్రసాదరావు
- కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు జగనన్న: పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్
- ప్రపంచాన్ని శాసిస్తోంది సోషల్ మీడియానే: జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ
- దేశానికే రోల్‌మోడల్ సీఎం జగనన్న: పేరాడ తిలక్
- ఉత్సాహంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం



హాజరైన సోషల్ మీడియా ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సోషల్ మీడియా సైనికులు బాధ్యతగా పనిచేస్తున్నారని, మరో 40 రోజుల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో మరింతగా పనిచేయాలని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ అసలైన నాయకులు ప్రజల కోసం పనిచేస్తారని, వారి జీవన ప్రమాణాలు పెంచుతారని అన్నారు. ఈ లక్షణాలన్నీ సీఎం వైఎస్ జగన్‌లో పుష్కలంగా ఉన్నాయని ప్రశంసించారు. ఒకప్పుడు జగన్ సంక్షేమ పథకాలను వ్యతిరేకించిన చంద్రబాబు ఇప్పుడు అలాంటి సంక్షేమ పథకాలు తానూ అమలు చేస్తానని ప్రకటించారని, ప్రతిఫలాలు కనిపిస్తుండడంతో ఆయన కూడా గొంతు మార్చారని అన్నారు. ఆ రోజు రాజధాని నిర్మాణం పేరిట సింగపూర్ నుంచి ఒక వ్యక్తిని తీసుకు వచ్చి జీ టు జీ అని దోపిడీ చేయాలి అని చూశారని, అవన్నీ అబద్ధాలని తేలిపోయాయని చంద్రబాబును తూర్పారపట్టారు. కులం, మతం, ప్రాంతం అన్నవి చూడకుండా అర్హులకు అన్ని పథకాలూ అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేన్నారు. రానున్న రోజుల్లో మరింత సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

● ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్ మాట్లాడుతూ అబద్ధాన్ని నిజం చేసి చూపించడం ఎల్లో మీడియాకి వెన్నతోపెట్టిన విద్య అని అన్నారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు కబుర్లు చెప్పుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటారని విమర్శించారు. ఎంపీ సీటును గెలిచి సీఎం వైఎస్ జగన్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. తూర్పు కాపు, శిష్టకరణాలను ఓబీసీలో చేర్పించేస్తానని హడావుడి చేసిన ఎంపీ మూలంగా ఓబీసీ రాకుండా పోయిందన్నారు.

● ప్రొఫెసర్ గుంట తులసీరావు, విజయభాస్కర్‌లు మాట్లాడుతూ మన అస్త్రశస్త్రాలన్నీ సోషల్‌మీడియానే అని అన్నారు. చంద్రబాబు అండ్ కో రాష్ట్రానికి పెట్టుబడులు ఏమి రావడం లేదని చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. 2014నుంచి 2018 వరకు రూ.32వేల కోట్లు పెట్టుబడులు వస్తే 2019 నుంచి 2024 వరకు రూ.లక్షాఎనిమిది వందల కోట్లు వచ్చాయన్నారు. దుష్ప్రచారాల్ని తిప్పికొట్టే శక్తి ఒక్క సోషల్ మీడియాకే ఉందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, నందిగాం ఎంపీపీ, సోషల్‌మీడియా నాయకులు లక్ష్మణరావుతో పాటు జిల్లాలో 8 నియోజకవర్గాల సోషల్‌మీడియా టీం పాల్గొన్నారు.

మాటిచ్చారంటే.. చేస్తారంతే..



సీఎం వైఎస్ జగన్ మాటిచ్చారంటే చేసి తీరుతారు. బ్రిటిష్ కాలం తర్వాత మళ్లీ భూముల రీ సర్వే వైఎస్ జగన్ మాత్రమే చేయిస్తున్నారు. ఇటీవల అచ్చెన్నాయుడు మాట్లాడుతూ టీడీపీ 160 సీట్లు గెలుస్తుందని ప్రకటించుకున్నారు. అసలు టీడీపీ పోటీ చేసే సీట్లే అన్ని లేవు. ఇంకెలా గెలుస్తారు. జగన్‌ను ఎదుర్కొనే దమ్ము లేక జనసేనతో పొత్తు, షర్మిలతో సంప్రదింపులు, బీజేపీతో కుమ్మక్కు, వామపక్షాలతో చేయి కలపడం వంటివి చేస్తున్నారు. ఎవరెన్ని చేసినా జనమంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ రావాలని కోరుకుంటున్నారు. సీఎం అందించిన సంక్షేమ పథకాలను సోషల్ మీడియా ద్వారా జనంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్దాం.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

పేదోడి ధైర్యం జగనన్న



పేదవాడు ధైర్యంగా బతకడానికి రావాల్సిన భరోసా సీఎం వైఎస్ జగన్ కల్పించారు. మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేశారు. గతంలో ధనవంతులే ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఉండేవారు. కానీ వైఎస్ జగన్ జనం కోసం పనిచేసే వారిని చట్టసభలకు పంపిస్తున్నారు. మన జిల్లాలో మూలపేట పోర్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆఫ్‌షోర్, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, వైఎస్సార్ సుజలధార వంటి పనులెన్నో చేశారు. వైఎస్సార్ సీపీ విజయంలో సోషల్‌మీడియాదే కీలకపాత్ర.

– పేరాడ తిలక్, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి

బాబు మాటలు నమ్మడం లేదు



ఇప్పుడు ప్రపంచాన్ని శాసిస్తోంది సోషల్ మీడియానే. చంద్రబాబు బూటకాలను జనం నమ్మడం లేదు. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువు, ఐబీ, ట్యాబ్‌లు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌ది. రాజకీయాల్లో మహిళలకు అవకాశం ఇచ్చారు. మాస్, క్లాస్ అన్ని వర్గాలను సోషల్ మీడియా ప్రభావితం చేయగలదు. సీఎం చేసిన మంచిని జనాలకు వివరించాలి.

– పిరియా విజయ, జెడ్పీ చైర్ పర్సన్

'నిబంధనలు పాటించాల్సిందే'

శ్రీకాకుళం క్రైమ్ : ప్రభుత్వ ఎక్సైజ్ విభాగం ద్వారా నడుస్తున్న మద్యం షాపులు నిబంధనలు పాటించాల్సిందేనని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్(ఈఎస్), ఎచ్చెర్ల బాట్లింగ్ డిపో మేనేజర్ బి.సుబ్బారావు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా ఏపీ ఎస్‌బీసీఎల్ ఎండీ గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారని ఈఎస్ పేర్కొన్నారు. ప్రతి దుకాణంలో ఆర్-1, ఆర్-2, ఆర్-3 బుక్కులను ఉంచాలని, స్టాకు వివరాలు సూపర్‌వైజర్లు పొందుపర్చాలని తెలిపారు. కొత్త బ్రాండ్ల ఎమ్మార్పీ వివరాలు షాపులో కనపడేలా ప్రదర్శించాలని, పాడైన బీర్లు, బ్రీజర్లు, మద్యం బాటిళ్ల రోమో లేదా అరోమోల చేత పంచనామా రాయించి వాటిని పారబోయాలన్నారు. షాపులో సీసీ కెమెరాలు పనిచేసేలా చూసి వాటిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి లింక్ చేయాలని సూచించారు. బిల్లు బుక్‌లను మెయింటెన్ చేసి అడిగిన వారికి తప్పక బిల్లు ఇవ్వాలన్నారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా కాకుండా చూడాలని, సరఫరా చేస్తే ఎస్ఎస్, ఎస్ఎమ్‌లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

డిస్‌ప్లే బోర్డులు లేక అవస్థలు




కోచ్ డిస్‌ప్లే బోర్డు లేని సోంపేట రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం

కంచిలి: ఉద్దాన ప్రాంత ప్రజల రైలు ప్రయాణ అవసరాలు తీర్చడంలో కీలకంగా ఉన్న సోంపేట రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాంల పైన కోచ్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రయాణికుల సామర్థ్యం పెరుగుతున్నా సదుపాయాలు మాత్రం ఏర్పాటు చేయడం లేదు. డిస్‌ప్లే బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులకు రిజర్వ్ కోచ్‌లు ఎక్కడ ఆగుతున్నవీ తెలియడం లేదు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు మరింత అవస్థ పడుతున్నారు. ఇప్పటికైనా ఈస్ట్‌కోస్ట్ డివిజన్ పరిధిలో ఉన్న సోంపేట స్టేషన్ అవసరాలు గుర్తించి, పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యాదీవెన నిధుల విడుదల నేడు

● జిల్లాలో 50,945 మంది విద్యార్థులకు రూ.35.17 కోట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పేద విద్యార్థుల చదువుకు ఆసరా ఇస్తూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యాదీవెన పథకాన్ని తీసుకువచ్చారు. ఇప్పటికి నాలుగేళ్లుగా నిరాటంకంగా పేద విద్యార్థుల చదువుకు సాయం చేసిన ప్రభుత్వం ఈ ఏడాది కూడా సాయం చేయడానికి రంగం సిద్ధం చేసింది. విద్యాదీవెన పేరిట డిగ్రీ, ఆపై తరగతులు, డిప్లమాలు, ఇంజినీరింగ్, మెడికల్ చదువులకు శుక్రవారం విద్యా దీవెన అందజేయనున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కాపు, క్రిస్టియన్ వర్గాలకుచెందిన వారికి ఈ సాయం అందిస్తున్నారు. ఈ విడతలో జిల్లాలో 50,945 మంది విద్యార్థులకు గాను 45,863 తల్లుల-విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో రూ. 35,17,67,088 లు జమ చేయనున్నారు. ఈ కార్యక్రమం ఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలో శుక్రవారం ప్రారంభిస్తారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమం వీక్షిస్తారు.



సామాజిక వర్గాల వారీగా

● 43,179 మంది	బీసీ విద్యార్థులకు	రూ. 30,00,54,904
● 3,964 మంది	ఎస్సీ విద్యార్థులకు	రూ. 2,55,42,454
● 1,335 మంది	ఎస్టీ విద్యార్థులకు	రూ. 71,26,307
● 1,539 మంది	ఈబీసీ విద్యార్థులకు	రూ. 1,11,56,397
● 158 మంది	మైనారిటీ విద్యార్థులకు	రూ.9,51,587
● 23 మంది	క్రిస్టియన్ విద్యార్థులకు	రూ. 2,11,943
● 743 మంది	కాపు విద్యార్థులకు	రూ. 67,23,633



● పల్లెలో పల్లకీ..

కాలం ఒక్కసారిగా వెనక్కి తిరిగింది. మోటారు ఇంజిన్ల శబ్దం, డీజేల ధ్వనులు లేని కాలంలో పల్లకీపై వధువు ఊరేగుతుంటే ఊరంతా చూసి ఆశీర్వదించేవారు. కాలం మారిపోవడంతో పల్లకీలతో పాటు దాన్ని మోసే బోయీలూ కనిపించకుండాపోయారు. మళ్లీ ఇన్నాళ్లకు బాతువ, పున్నాం, ఆనందపురం గ్రామాల్లోని పెళ్లి తంతులో పల్లకీ కనిపించింది. – జి.సిగడాం

శివరాత్రి ఉత్సవాలకు శుభరాట



శ్రీముఖలింగం ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

జలుమూరు: దక్షిణ కాశీగా పేరొందిన శ్రీముఖలింగంలో ఈ నెల 8 నుంచి 11 వరకూ వరకూ జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు గురువారం శుభరాట వేశారు. పందిరి రాట వేసిన రోజు నుంచి ఆలయ ఉత్సవ పనులు ప్రారంభంచనున్నారు. అలాగే విద్యుత్, క్యూలు, అలంకరణ, గర్భగుడిలో ముఖ్యమైన పనులకు అంతా సిద్ధం చేశారు. విగ్రహాల శుద్ధి కూడా ప్రారంభించనున్నారు. దీనికి ముందు ముత్తైదువులు పాలకొమ్మ, మామిడి తోరణాలు వెదురు కర్రతో కలిపి ముత్యాలు, గోధుమ రాయి పాలతో కలిపి భూమి పూజ చేశారు. ఈఓ పి.ప్రభాకరరావు, సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు కె.హరి ప్రసాద్, పురోహితులు బంకుపల్లి భూషణ శర్మ, ఆలయ అర్చకులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి'



మాట్లాడుతున్న దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎస్.విజయరాజు

టెక్కలి: ఎండల మల్లన్న సన్నిధిలో ఈనెల 8న మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎస్.విజయరాజు పేర్కొన్నారు. ఆయన గురువారం టెక్కలి మండలం రావివలస శ్రీ ఎండల మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వాహణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చూడాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు సహాయ కమిషనర్ బీఆర్‌వీవీ ప్రసాద్ పట్నాయక్, ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, ఈఓ వి.రాధాకృష్ణ ఉన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ చౌర్యంపై కేసులు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై విద్యుత్ విజిలెన్స్ సిబ్బంది కేసులు నమోదు చేస్తున్నారు. తాజాగా కుప్పిలి గ్రామంలో బల్లాడ సీతయ్యరెడ్డి అనే వ్యక్తి డీటీఆర్ నుంచి రాత్రిళ్లు డైరెక్ట్ టాపింగ్ చేసి విద్యుత్ చౌర్యం చేయటాన్ని గుర్తించారు. ఈ మేరకు రాత్రి తనిఖీ నిర్వహించి అసెస్మెంట్ రూ. 89,215, కాంపౌండ్ రూ.7000 మొత్తం రూ. 96,215 అపరాధ రుసుం విధించారు. కుప్పిలి గ్రామంలో నాయన సూర్యనారాయణ రెడ్డి అనే వ్యక్తి కోళ్ల ఫారంలో రాత్రిళ్లు డైరెక్ట్ టాపింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. రూ. 35,979 అపరాధ రుసుం విధించారు. ఈ ప్రాంతంలో గత కొంతకాలంగా విద్యుత్ చౌర్యం చేస్తున్న 28 మందిపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో సీఐ ఎం.వెంకటనారాయణ, ఏడీఈ చంద్రమౌళి బృందం పాల్గొంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని తాళ్లవలస సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదపాక సూర్యారావు (52) అనే వ్యక్తి మృతి చెందారు. తాళ్లవలస గ్రామానికి చెందిన సూర్యారావు జాతీయ రహదారి దాటుతుండగా రణస్థలం నుంచి శ్రీకాకుళం వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే ఊపిరి వదిలేశారు. మృతుడికి భార్య అచ్చెలమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరంతా సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుని భార్య అచ్చెలమ్మ ఫిర్యాదుమేరకు ఎస్ఐ సీహెచ్ స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి



కారు ఢీకొనడంతో మృతి చెందిన వృద్ధుడు

టెక్కలి రూరల్: మండలంలోని శ్యామసుందరాపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని సకలభక్తుల సత్యం(68) అనే వృద్ధుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గార మండలం తంగులపేట గ్రామానికి చెందిన సత్యం టెక్కలిలో తన బంధువుల ఇంటిలో జరిగిన శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో.. శ్యామసుందరాపురం జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా కోటబొమ్మాళి నుంచి పలాస వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొట్లాటలో గాయపడిన వ్యక్తి మృతి



యడ్ల రమణ (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని బొరిగివలసలో మూడు రోజుల కిందట జరిగిన కొట్లాటలో గాయపడిన యడ్ల రమణ (30) అనే వ్యక్తి గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి ఎంక్వైరీ చేశారు. తల్లి సింహాద్రి, తండ్రి నీలయ్య, భార్య శాంతమ్మల నుంచి వివరాలు సేకరించారు. మూడు రోజుల కిందట తగువు జరిగిందని, బంగావు సూర్యనారాయణ తదితరులు రమణను కొట్టారని, వెంటనే ఆస్పత్రిలో జాయిన్ చేశామని చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని తండ్రి నీలయ్య తెలిపారు. ఈ సంఘటనపై నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు మాట్లాడుతూ గ్రామానికి వెళ్లి పరిశీలన చేశామని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తీసుకున్నామని, 174 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

రాష్ట్ర బాక్సింగ్ పోటీలకు పయనం



రాష్ట్రపోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, ఉమా, రాజీవ్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయాలతో పతకాలు సాధించి రావాలని డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్ రావు పిలుపునిచ్చారు. మార్చి 1 నుంచి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల బృందం గురువారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లింది. జిల్లా నుంచి బి.దుర్గాప్రసాద్ (35 కేజీల విభాగం) కె.యశ్వంత్‌సాయి (40 కేజీల విభాగం), ఎస్.వినయ్‌వరుణ్ (46 కేజీల విభాగం), ఎం.దినేష్ (52 కేజీల విభాగం), పి.దిలీప్ (55 కేజీలు విభాగం), ఎస్.దేవిప్రసాద్ (58 కేజీల విభాగం), ఎ.రామ్‌చరణ్‌రెడ్డి (61 కేజీల విభాగం), జి.సంజీవరెడ్డి (స్టాండ్ బాయ్)గా, అలాగే జిల్లా నుంచి ఎం.కె.శాంతి కుమారి, కె.దివ్యశ్రీ ఎంపికై నవారిలో ఉన్నారు. వీరిని బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా కార్యదర్శి బీపీ లక్ష్మణ్‌దేవ్(అను), వంగా మహేష్, బాక్సింగ్ కోచ్ పి.ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ రాజీవ్ తదితరులు అభినందించారు.

100%కు దగ్గరలో..

- జిల్లాలో 6,39,370 కుటుంబాలకు ఆరోగ్య కార్డుల జారీకి చర్యలు
- ఇప్పటివరకు 5.07 లక్షల మందికి పంపిణీ పూర్తి
- 90 శాతం వరకు పంపిణీ చేయడంతో రాష్ట్రంలో 8వ స్థానంలో జిల్లా

అరసవల్లి:

ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులను ఇంటింటికీ చేర్చడంలో జిల్లా యంత్రాంగం చక్కటి పనితీరు చూపిస్తోంది. ఇప్పటికే అద్భుత సేవలందిస్తున్న సచివాలయ వ్యవస్థ ద్వారానే క్షేత్ర స్థాయిలో వైద్య సేవలందించే క్రమంలో ఆరోగ్య శ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేశారు. ఈ పథకంతో కనీసంగా ప్రొసీజర్ వైద్య ఖర్చు రూ.వెయ్యి నుంచి రూ.25 లక్షల వరకు వైద్య ఖర్చు పరిమితిని పెంచుతూ.. ఈ భారమంతా ప్రభుత్వమే భరించనుంది. ఎంతటి వైద్యమైనా, ఆపరేషన్ అయినా పేదసామాన్య వర్గాలు ఒక్క రూపాయి చెల్లించకుండానే చేయించుకునేలా సీఎం వైఎస్ జగన్ ఈ పథకానికి కొత్త రూపం ఇచ్చారు. ప్రతి ఇంటికి సరికొత్తగా ఆరోగ్యశ్రీ కొత్త స్మార్ట్ కార్డులు అందించేలా చర్యలు చేపట్టారు. జిల్లాలో ఈ కొత్త స్మార్ట్ కార్డులను సచివాలయాల వారీగా అందిస్తున్నారు.

6.39 లక్షల కార్డుల పంపిణీ లక్ష్యంగా..

జిల్లాలో కొత్తగా ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కోసం వైద్యారోగ్య శాఖ గత రెండు నెలల నుంచి ప్రత్యేక డ్రైవ్ మొదలుపెట్టారు. ఈ మేరకు జిల్లాలో మొత్తం 6,39,370 కుటుంబాలకు కొత్త కార్డులను అందించేలా ప్రణాళిక సిద్ధం కాగా, ఇప్పటివరకు జిల్లాకు 5,60,942 కార్డులు జిల్లాకు చేరాయి. ఇందులో ఇప్పటివరకు 5,07,763 కార్డులను అర్హులందరికీ అందజేశారు. 90 శాతానికి పైగా పంపిణీ పూర్తి చేయడంతో రాష్ట్రంలోనే 8వ స్థానంలో మన జిల్లా నిలిచింది. ఆరోగ్యశ్రీ యాప్‌ను ఇంట్లో కనీసం ఒకరైనా డౌన్‌లోడ్ చేసుకునేలా క్షేత్ర స్థాయి సిబ్బంది బాధ్యత తీసుకుంటున్నారు. అలాగే దిశ యాప్ కూడా డౌన్‌లోడ్ చేయించేలా చర్యలు చేపడుతున్నారు.



కొత్త స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డు

రూ.25 లక్షలకు పెరిగిన ఆరోగ్యశ్రీ పరిమితి

ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చిన జబ్బుల సంఖ్యతో పాటు వైద్య సేవలు, శస్త్రచికిత్సల పరిమితి ఏకంగా రూ.25 లక్షలకు పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్ణయించి అమలు చేస్తున్నారు. ఈక్రమంలో కొత్తగా ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్నారు. ఈ కార్డులతో రోగికి తాను కోరుకున్న కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచిత వైద్యాన్ని, ఉచిత శస్త్ర చికిత్సలను చేయించేలా తాజా మార్గదర్శకాలున్నాయి. కొత్తగా ఆరోగ్యశ్రీ సేవలు స్మార్ట్ కానున్న నేపథ్యంలో ప్రతి ఇంటా ఆరోగ్యశ్రీ కార్డు అందేలా వైద్యారోగ్య శాఖ చర్యలు చేపడుతోంది. గుండెజబ్బుతో పాటు క్యాన్సర్ వంటి అతిపెద్ద జబ్బులను సైతం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చిన సమాచారాన్ని క్షేత్ర స్థాయిలో తెలిసేలా అవగాహన కలిగించేలా చర్యలు చేపడుతున్నారు. గతంలో క్యాన్సర్ చికిత్సకు ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల వరకు పరిమితి ఉండేది. ఆ తర్వాత ఖర్చులన్నీ రోగులే భరించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ పరిమితిని ఎత్తివేస్తూ తాజా మార్గదర్శకాలు వెలువడ్డాయి. దీంతో రోగికి ఖర్చయిన ప్రతి పైసా గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు ప్రభుత్వమే భరిస్తుంది. అలాగే ఇంత వరకు ఆరోగ్యశ్రీ పరిధిలో 1,059 ప్రొసీజర్స్ ఉండగా, ఇప్పుడు ఏకంగా 3,257 వ్యాధులను (ప్రొసీజర్స్) ఈ పరిధిలోకి తీసుకొచ్చారు. 2019 నుంచి ఇప్పటివరకు 2.40 లక్షల మందికి రూ.500 కోట్లకు పైగా విలువైన వివిధ రకాల శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారానే సేవలందించారు.

త్వరలోనే శతశాతం పంపిణీ



ఆరోగ్యశ్రీ పరిధి రూ.25 లక్షలకు పెరగడంతో అర్హులైన వారంతా ఈ స్మార్ట్ కార్డులను తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటివరకు జారీ అయిన కార్డుల్లో 90 శాతం వరకు పంపిణీ పూర్తి చేశాం. ఇక వంద శాతం పంపిణీకి చర్యలు చేపడుతున్నాం. అలాగే సరికొత్త సాంకేతికతతో యాప్‌ను, అలాగే క్యూఆర్ కోడ్‌తో ఈ ఆరోగ్యశ్రీ కార్డు ప్రతి ఇంటికి చేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఇంటిలో సభ్యుల వివరాలతో పాటు సమీపంలో ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలన్నీ తెలుస్తాయి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
– డాక్టర్ ప్రకాశరావు, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్

వచ్చే ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు రావు



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: రానున్న ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు కూడా రావని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఆమదాలవలస నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తయారు చేశామని చెప్పారు. మండలంలోని కణుగులవలస గ్రామంలో నాడు–నేడు పనుల ప్రారంభోత్సవంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులు పరాభవం తప్పదని గ్రహించారని, అందుకే పాలక పక్షంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. గత టీడీపీ పాలనలో అవినీతి, అక్రమాలు తప్ప ప్రజలకు చేసిన ఒక్క మంచి పనినైనా చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. పరిపాలన చేతకాని అసమర్థులు పనికిరాని స్టేట్‌మెంట్‌లు ఇస్తున్నారని విమర్శించారు. టీడీపీకి ఓటమి భయం పట్టుకోవడంతో తన కుటుంబంపై లేనిపోని నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో ఐదేళ్ల పాలనలో ఎక్కడైనా అవినీతి చేసినట్లు నిరూపిస్తే తాను రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ చేశారు. ఆమదాలవలస నియోజకవర్గంలో వ్యవసాయ పాలిటెక్నిక్, వెటర్నరీ పాలిటెక్నిక్, హార్టికల్చర్ ల్యాబ్, బయోలాజికల్ ల్యాబ్, బలసలరేవు బ్రిడ్జి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, గ్రామాల్లో తారు రోడ్ల నిర్మాణాలు, గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి వంటివి టీడీపీ నాయకుల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కణుగులవలస గ్రామానికి బీటీ రోడ్డు వేసిన ఘనత వైఎస్సార్‌సీపీకి దక్కుతుందన్నారు. గ్రామాల్లో టీడీపీ హయాంలో వేసిన రోడ్లు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా సొంత కుటుంబీకులకు కాంట్రాక్ట్ పనులు అప్పగించడంతో అవి గోతుల మయంగా మారాయని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

కొనసాగుతున్న టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ టెట్ –2024 జిల్లాలో కొనసాగుతోంది. గురువారం ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 100కి 93, రెండో షిఫ్టులో 100కి 90 మంది హాజరయ్యారు. చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 100కి 89, రెండో షిఫ్టులో 100కి 92 మంది హాజరయ్యారు. 400 మందికి 364 మంది హాజరు కాగా, ఇప్పటి వరకు 1200 మందికి 1093 మంది హాజరయ్యారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



జొన్నవలస 30పడకల ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఇటీవల నిర్వహించిన జగనన్న భూ రీ సర్వే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయని, దీనికి సంబంధించి సిబ్బందికి పలు సూచనలు అందించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల పోలింగ్ కేంద్రంతో పాటు డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. అక్కడి నుంచి పట్టణంలోని మోణంగివారి వీధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి హాజరు పట్టికను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. చివరిగా మండలంలోని జొన్నవలస సమీపంలో ఉన్న 30 పడకల సామాజిక ఆస్పత్రిని సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఓపీ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులను పరామర్శించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ రాంబాబు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్ నాయక్, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గోకార్టింగ్ చాంపియన్‌షిప్

- గోకార్టింగ్ పోటీల్లో విన్నర్‌గా రఘు ఇంజినీరింగ్ కళాశాల
- హ్యాకథాన్ పోటీల్లో అనిట్స్ కళాశాలకు ప్రథమ స్థానం



టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన గోకార్టింగ్ జాతీయ స్థాయి కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్య అతిథులు, కళాశాల యాజమాన్యం

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి గోకార్టింగ్ చాంపియన్ షిప్, హ్యాకథాన్ ఆవిష్కార్ జాతీయ స్థాయి కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రఖ్యాత యూనివర్సిటీల నుంచి హ్యాకథాన్‌కు 35 బృందాలు, గోకార్టింగ్‌కు 14 బృందాలు హాజరయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన టీసీఎస్ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి బాలప్రసాద్ పెద్ది, గీక్స్‌ఫర్ చీఫ్ టెక్నాలజీ అధికారి శిఖర్ గోయల్, టాటా టెక్నాలజీ చీఫ్ ఇంజినీర్ రవీంద్రషా తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాల ద్వారా వెలికితీయవచ్చునని వెల్లడించారు. ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాలు నిర్వహించిన ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలను ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కన్వీనర్లు డి.శ్రీరాములు, డి.ఆజాద్, అధ్యాపకులు జి.సతీష్‌కుమార్, జె.సురేష్, డి.రఘువీర్, రెడ్డి హరిచందన, సాయితరుణ్ మిశ్రోతో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. హ్యాకథాన్ జాతీయ కార్యక్రమంలో భాగంగా 'ఎఫెక్టివ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అండ్ డిమోలిషన్' అనే అంశంపై అనిట్స్ ఇంజినీరింగ్ కళాశాల రూపకల్పన చేసిన ప్రాజెక్టుకు ప్రథమ స్థానం లభించింది. విజేతలకు రూ.లక్ష బహుమతిగా అందజేశారు. అలాగే రూర్కెలా కోయర్ యూనివర్సిటీ విద్యార్థులు రూపకల్పన చేసిన 'వ్యర్థాలను తిరిగి వినియోగించడంపై' చూపిన పరిష్కారానికి ద్వితీయ బహుమతి లభించింది. వీరికి రూ.75 వేలు నగదు బహుమతి అందించారు. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపిన గీతమ్ యూనివర్సిటీకి రూ.50 వేలు అందజేశారు. జాతీయ స్థాయి గోకార్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా ఎనిగ్మా (రఘు) ఇంజినీరింగ్ కళాశాల ఎంపికైంది. ఆదిత్య కళాశాలతో పాటు మిగిలిన బృందాలకు వివిధ అంశాల్లో 14 ఉత్తమ బహుమతులు లభించాయి. మొత్తంగా రూ. 4లక్షల విలువైన నగదు బహుమతులను అందజేశారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న బీఆర్‌ఏయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: హెచ్ఐవీపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖలు సంయుక్తంగా ఎయిడ్స్, హెచ్ఐవీపై ప్రచార కళా జాతర గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఒక దశలో దేశంలో ప్రధాన సమస్యగా మారిందన్నారు. ప్రచారం, ప్రజల్లో చైతన్యం, నియంత్రణ చర్యలతో పూర్తిగా అదుపులోకి వచ్చిందన్నారు. అయిప్పటికీ సమాజం అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత క్రమశిక్షణతో మెలగాలన్నారు. అధునాతన పోకడల పేరుతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. విద్యపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖరరావు, జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణరావు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాపరిశోధన బృందం సభ్యులు

బూర్జ: కొల్లివలసలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ, ఐబీ బృందం గురువారం పరిశీలించింది. ముందుగా విద్యాలయంలో విద్యార్థులకు బోధన, అభ్యసన విధానాన్ని పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులను ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు. వారితో పాటు తరగతి గదిలో కూర్చుని పాఠాలు విన్నారు. తర్వాత ఉపాధ్యాయ బృందంతో ప్రత్యేకించి బోధన విధానాలపై చర్చించారు. పాఠశాలలో కోర్సు వివరాలు గురించి, పాఠశాల ప్రగతి గురించి మాట్లాడారు. లైబ్రరీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు చేస్తున్న ప్రాజెక్టులు చూసి అభినందించారు. పాఠశాలకు ఇటీవల వచ్చిన అవార్డుల గురించి తెలుసుకున్నారు. అనంతరం బడి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఈఆర్టీ ప్రొఫెసర్ కేశిరాజు శ్రీనివాస్, సీనియర్ కరిక్యులమ్ డిజైన్ మేనేజర్ వాషింగ్టన్ (యూఎస్ఏ), మిస్టర్ మైకెల్ (అసోసియేషన్ మేనేజర్, అసెస్మెంటు ఆపరేషన్స్ ఐ.బి, యూకే) ఉన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, సర్వశిక్షా అభియాన్ సీఎంఓ పేడాడ ప్రభాకరరావు, గురుకులం వైస్ ప్రిన్సిపాల్ ఏ.లక్ష్మణరావు, పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని(17) అదృశ్యమైనట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే రూరల్ మండలం సానివాడ గ్రామానికి చెందిన విద్యార్థిని ఈనెల 28న (బుధవారం) నగరంలో ఉన్న కళాశాలకు హాల్‌టికెట్టు తెచ్చుకోవడానికి బయల్దేరింది. కళాశాల యాజమాన్యం రూ. 3 వేలు బకాయి ఫీజు కడితేనే హాల్‌టికెట్టు ఇస్తామనడంతో అక్కడి నుంచే విద్యార్థిని తన తల్లికి ఫోన్ చేసి చెప్పింది. విద్యార్థిని తల్లి ఫీజు తాను కట్టేస్తానని చెప్పడమే కాక తనను ఊరొచ్చేయమని చెప్పి కళాశాలకు వెళ్లి ఫీజు కట్టేసింది. తల్లి ఫీజు కట్టేసి ఇంటికొచ్చినా విద్యార్థిని రాకపోవడంతో తెలిసిన వారందరి వద్దా వాకబు చేసింది. అయినప్పటికీ రాకపోవడంతో ఒకటో పట్టణ పోలీసులను ఆమె ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ పేర్కొన్నారు.

సింగిల్ మేజర్ సబ్జెక్ట్స్‌పై టీఓటీ ప్రోగ్రాం



మాట్లాడుతున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ. పక్కనే డాక్టర్ హరిత, మోహనరావు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సింగిల్ మేజర్ సబ్జెక్టులపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే విధంగా అధ్యాపకులు సన్నద్ధం కావాలని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఎస్ఆర్సీ పరిధిలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ఐదు రోజుల టీఓటీ ప్రోగ్రాం గురువారం ప్రారంభమైంది. బోటనీ, మైక్రో బయాలజీ అధ్యాపకులకు జాతీయ విద్యా విధానంలో భాగంగా నూతనంగా ప్రవేశపెట్టిన సింగిల్ మేజర్ సబ్జెక్టులకు సంబంధించి టీఓటీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు రిసోర్స్ పర్సన్లు యస్.రుద్రమరాణి, యు.ఫణికుమారి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్సీ కోఆర్డినేటర్ బల్రి మోహనరావు, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రోణంకి హరిత పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో శుక్రవారం నుంచి ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు మొదలుకానున్నాయి. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. తొలిరోజు ఫస్టియర్ విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. కనీసం అర్ధగంట ముందు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 83 కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షలకు పునర్విభజన శ్రీకాకుళం జిల్లాలో 45702 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా నడుమ పక్కాగా 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పటిష్ఠమైన పోలీసు బందోబస్తును కల్పిస్తున్నారు.



శ్రీకాకుళంలోని ఓ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న ఫర్నీచర్